నగదు రహిత మీ సేవ

అధిక వసూళ్ల నివారణకు ప్రభుత్వం కొత్త విధానం

- జవాబుదారీతనాన్ని పెంచడమే ప్రధాన ధ్యేయం
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పనతో అక్రమాలకు చెక్
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1,327 మీ సేవ కేంద్రాలు

సాక్షి, సిటీబ్యూరో: మీ సేవ కేంద్రాల నిర్వహణలో అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. జవాబుదారీతనం ఉండాలని.. ప్రజలు నేరుగా డబ్బు చెల్లించకుండా.. క్యాష్‌లెస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. మీ సేవ కేంద్రాల ప్రారంభం నుంచి నేరుగా డబ్బు చెల్లింపులు జరిగాయి. దీంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా డబ్బు వసూళ్లు చేస్తున్నారని సంబంధిత అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది.

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1,327 కేంద్రాలు

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 1,327 మీ సేవ సెంటర్లు ఉండగా, ఒక్క మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే 306 మీ సేవ కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని మీ సేవ కేంద్రాల్లో క్యూఆర్ స్కాన్ కోడ్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. దరఖాస్తుదారు ఏ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారో.. అందుకు కోసం ప్రభుత్వం కేటాయించిన ధర మేరకు ఫోన్‌కు లింక్ వస్తోంది. ఆమేరకు డబ్బు చెల్లించాల్సి ఉంటోంది.

అధిక వసూళ్లకు అడ్డుకట్ట..

మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు రోజుకు 10 దరఖాస్తుల వరకు ఫోన్ ద్వారా క్యూఆర్ స్కాన్‌తో డబ్బు చెల్లించడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు ఎన్నిసార్లు అయినా స్కాన్ చేయవచ్చు. గతంలో ఏ దరఖాస్తుకు ఎంత డబ్బు తీసుకునేవారో తెలియకుండా ఉండేది. ఇక నుంచి దరఖాస్తుదారు ఎంత రుసుం చెల్లిస్తున్నారో తెలిసిపోతుంది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త విధానంతో అధిక వసూళ్లకు అడ్డుకట్టపడుతుంది.

ప్రభుత్వ ఆదేశాలతో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ సహా శివారులోని మీ సేవ కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు చెల్లించాల్సిన రుసుంను వారికి తెలిసేలా క్యూఆర్ స్కాన్ అమలు చేస్తున్నట్లు సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తద్వారా ఎంత రుసుం చెల్లించారో చూసుకోవడానికి అవకాశం ఉంటుందంటున్నారు. ఈ విధానంతో అధిక వసూళ్లకు ఏమాత్రం ఆస్కారం తావుండదని పేర్కొంటున్నారు.

గతంలో ఇష్టారాజ్యంగా..

ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు ఇప్పటివరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు వీలుండేది. గ్రేటర్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలలోని పలు మీ సేవ కేంద్రాల్లో ధ్రువ పత్రాల కోసం అధిక రుసుం వసూలు చేసిన సంఘటనలు కోకొల్లలు. ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా మీ సేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి రావటంతో...గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు తమ అవసరాల నిమిత్తం అధిక రుసుం వసూలు చెల్లించాల్సి వచ్చింది. మీ సేవ కేంద్రాల్లో సిటిజన్ చార్ట్ ఉన్నా.. వాటిని నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మేడ్చల్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర


మేడ్చల్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో ..


ఒడిస్సా జగన్నాథ సేవా సమితి ఆధ్వర్యంలో..

మేడ్చల్: ఇస్కాన్, ఒడిస్సా జగన్నాథ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో జగన్నాథ రథయాత్రలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో కేఎల్ఆర్ వెంచర్‌లోని శివాజీ విగ్రహం నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండ్, వివేకానంద కూడలి, అంబేడ్కర్ కూడలి, హౌసింగ్ బోర్డు, మార్కెట్ రోడ్ల మీదుగా కిష్టాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించి ఫంక్షన్ హాల్‌లో ముగింపు సమావేశం నిర్వహించారు.

ఒడిస్సా జగన్నాథ సేవా సమితి ఆధ్వర్యంలో..

ఒడిస్సా జగన్నాథ సేవా సమితి ఆధ్వర్యంలో అత్వెల్లిలోని శివాలయ ఆవరణలో ఉన్న జగన్నాథ ఆలయం నుండి అత్వెల్లి మీదుగా జాతీయ రహదారి నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ మీదుగా అయ్యప్ప గుడి వరకు రథయాత్ర చేపట్టారు. రథాలను అందంగా పూలతో సంప్రదాయబద్ధంగా అలంకరించి ఊరేగించారు. రథాల్లో కృష్ణుడితో పాటు బలరాముడు, సుభద్రాదేవిల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాలను లాగారు. పట్టణ ప్రముఖులు నారెడ్డి నందారెడ్డి, అశోక్‌ముదిరాజ్, జగన్‌గౌడ్ రెండు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాంపల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో..

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి ఇస్కాన్ భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథయాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ, శ్రీబలరాం, శ్రీసుభద్రదేవి, ఉత్సవమూర్తులను రథయాత్రలో ఊరేగించారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, ఇస్కాన్ భక్తులు, కౌన్సిలర్ లక్ష్మి, రామక్కపేట రవీందర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి


జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన బీజేపీ నాయకురాలు మాధవీలత

పోచారం: ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరిస్తూ సనాతన ధర్మాన్ని పాటించాలని బీజేపీ నాయకురాలు మాధవీలత అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో భక్తి యోగా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీజగన్నాథ రథయాత్రను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్తిభావం వెల్లివిరిసేలా భజనలు చేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగుల పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలి

ఘట్‌కేసర్: ప్రభుత్వోద్యోగుల పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని భరోసా పార్టీ అధ్యక్షుడు ఏసయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రూపాయల వేతనం తీసుకునే ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా సర్కారు బడులపై నమ్మకం లేకే తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సర్కారు బడుల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించి, ఉపాధ్యాయులను నియమించి కార్పొరేట్ విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, జైరాం, ప్రకాశ్, భాస్కర్, ఉమ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసయ్య

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై లారీ బోల్తా


నుజ్జునుజ్జైన లారీ

కీసర: యాద్గార్‌పల్లి ఎస్సీ కాలనీ సమీపంలోని ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డులో లారీ బోల్తాపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ నుంచి ఏపీలోని నెల్లూరుకు టైల్స్ లోడ్‌తో లారీ ఆదివారం తెల్లవారుఝామున కీసర ఓఆర్ఆర్ మీదుగా వెళ్తున్నది. డ్రైవర్ సోహెల్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఒక్కసారిగా లారీ ఓఆర్ఆర్ ప్రధాన రహదారిపై నుంచి సర్వీస్ రహదారిపై బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సోహెల్, క్లీనర్ సాహిద్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం


గుంతలను పూడ్చుతున్న ట్రాఫిక్ పోలీసులు

ఉప్పల్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పల్ చౌరస్తాలోని రోడ్డు ధ్వంసమైంది. ఈ విషయాన్ని పలుమార్లు ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయ సమావేశాల్లో వారి దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ట్రాఫిక్ పోలీసులే ఆదివారం వరంగల్ జాతీయ రహదారిపై గుంతలను మట్టి, రాళ్లు వేసి పూడ్చి వేశారు. ఈ విషయాన్ని ప్రయాణికుడు ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ట్రాఫిక్ పోలీసుల శ్రమదానం, చొరవపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


గుండ్లపోచంపల్లి మినీట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మేడ్చల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మందకృష్ణ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భానుచందర్, రవి, మహేశ్, నర్సింగ్‌రావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..


కిష్టాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

మేడ్చల్: మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కిష్టాపూర్, మేడ్చల్‌లో నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. అలాగే వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరశురాం మాదిగ, బాల నర్సింహ, రాచందర్, బాలకృష్ణ, ఆనంద్, రామకృష్ణ, నర్సింగ్‌రావు, పద్మారావు, నరేందర్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


కీసరలో మాట్లాడుతున్న బాధితులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్‌పల్లి సర్వేనెంబర్ 137లోని ప్లాట్లను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యజమానులతో పాటు, స్థానికులు కోరుతున్నారు. కీసరలో ఆదివారం వారు మాట్లాడుతూ తాము 2015 లోనే సర్వేనెంబర్ 137లో ప్లాట్లు కొనుగోళ్లు చేశామన్నారు. అయితే మూడు నెలలుగా కొంతమంది వ్యక్తులు వచ్చి తమ ఇండ్లు, ఓపెన్ ప్లాట్లను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, అడ్డుకుంటే చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయమై కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

వైభవంగా పెద్ద పండుగ


ఆలయంలో బియ్యం కలుపుతున్న భక్తులు

మేడ్చల్: పట్టణంలోని కిందిబస్తీ దుర్గమ్మ ఆలయంలో ఆదివారం పెద్ద పండగను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బోనాల పండగకు ముందు పెద్ద పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక, ప్రముఖులు, కౌన్సిలర్లు అర్చన సందీప్‌గౌడ్, మణికంఠ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈడెన్ ప్రేయర్ చర్చిలో ఫెలోషిప్ సమావేశం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలోని ఈడెన్ ప్రేయర్ మినిస్ట్రిస్‌లో ఆదివారం యూత్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాస్టర్ రేవ డాక్టర్ విజయ్‌కుమార్, తిమోతి, సుశీల ప్రభాకర్ హాజరై దైవ సందేశాన్ని వినిపించారు. కార్య క్రమంలో యూత్ ఫెలోషిప్ నిర్వాహకులు నరేష్, వల్లీ, ఫిలిఫ్ జోయిల్, సెల్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మల్లాపూర్: బహుజన్ సమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్ స్ట్రాంగ్ హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీలం అనితరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాచారంలో ఉప్పల్ నియోజకవర్గం బీఎస్పీప్రధాన కార్యదర్శి మింద్రాల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గౌడ సుదర్శన్. కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్,ఉప్పల్ ఇన్‌చార్జి కుమార్,బాబు, ప్రభాకర్, గౌసియా బేగం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు వీడ్కోలు సమావేశం


మాజీ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిని సన్మానిస్తున్న వజ్రేశ్‌యాదవ్, రాజేశ్


మాజీ వైస్ ఎంపీపీ జంగమ్మను సన్మానిస్తున్న వజ్రేశ్‌యాదవ్, రాజేశ్

ఘట్‌కేసర్: కాచవానిసింగారంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా తాజా మాజీ చైర్మన్, స్థానిక వైస్ ఎంపీపీకి ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్ హాజరై తాజా మాజీ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మధు, అశోక్, ముత్యం, రాములుగౌడ్, గీత, జగదీశ్, నవీన్, విష్ణు, శ్యాం, సంధ్య, అరుణ, రజిత, సరళ, భద్రారెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

మల్లాపూర్: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం దోమల నివారణపై నాచారం ఇందిరానగర్‌లో అవగాన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూల కుండీలు, కొబ్బరి బొండాలు, పాత సామన్లలో నీటిని ఎప్పటి కప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్ఈ రజిని డీసీ ముకుందరెడ్డి, ఏఎంహెచ్‌వో రమేష్, ఎంటామాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజార్ రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో గత 7 నెలలుగా నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ నాచారంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాఘవేంద్రనగర్ కాలనీలో వర్షాకాలంలో నీళ్లు నిలుస్తున్నాయని సమస్య పరిష్కారం కోసం పైప్‌లైన్ వేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదన్నారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలన్నారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందిస్తూ పలు సూచనలు చేశారు కార్యక్రమంలో కాప్రా డీసీ ముకుందరెడ్డి, నాచారం ఏఈ లింగారావు, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, ముత్యంరెడ్డి,విఠల్ యాదవ్, భూపాల్‌రెడ్డి, సంజన్న, బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్ తదిరులు పాల్గొన్నారు.

ఇళ్లలో పనిచేసే మహిళలను కార్మికులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న బొజ్జ రమేష్

మల్లాపూర్: ఇళ్లలో పనిచేసే మహిళలను కార్మికులుగా గుర్తించాలని దళిత జనసమితి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం నాచారంలోని డీజేఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు పని ప్రదేశంలో అనేక రకాలుగా వివక్షకు గురవుతున్నారన్నారు. ఇంటి పనిచేసే మహిళలను కార్మికులుగా గుర్తించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సామాజిక భద్రత కల్పించాలని కోరారు. మహిళలపై మానసిక శరీరక వేధింపులు అత్యాచారాలు నివారించాలన్నారు.ఢిల్లీ, కేరళ, గోవా, తమిళనాడు, రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోనూ అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ఐ కల్పించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి. గుర్తింపు కార్డులను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత జన సమితి నేతలు ఇప్పల కుమార్, గంధం కళ్యాణ్, పరమేశ్వర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో సునీత హోమియోపతి, ఆయుష్ కేర్ క్లీనిక్ ఆధ్వర్యంలో కత్తి చిన్నమ్మ స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హోమియోపతి వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కీళ్ల వ్యాధులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు కార్యక్రమంలో డాక్టర్ ఎస్ ఎన్. బాబు కత్తి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు వెంకటప్రసాద్ కార్యదర్శి కర్రె శంకర్, ముఖ్య సలహాదారుడు పీజీ.సుదర్శన్, నరసింహ, టీబీ నరసింహ,వర్కింగ్ ప్రెసిడెంట్ జితేందర్, రఘు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు


ఎంపీ ఈటలతో నాగలింగం, సుధాకర్‌రెడ్డి

కీసర: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన కట్ట సుధాకర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కీసరగుట్ట అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ఎంపీకి వివరించారు. కీసరగుట్ట స్వామి దర్శనానికి రావాలని కోరుతూ ఎంపీని ఆహ్వానించారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

అంబేడ్కర్ అపార మేధావి


మాట్లాడుతున్న గట్టయ్య, శ్రీశైలం తదితరులు

ఘట్‌కేసర్: అంబేడ్కర్ అపార మేధావి అని ఘట్‌కేసర్ మున్సిపల్ కురుమ సంఘం వ్యవస్థాపకుడు దయ్యాల గట్టయ్య, అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ 18 డిగ్రీలు, ప్రపంచంలోని 60 దేశాల రాజ్యాంగాలు చదివి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగం అందించాడన్నారు. దాసు, నర్సింగ్‌రావు, రాజేశ్‌కుమార్, మహేందర్, సత్యం, పరమేశ్, గణేశ్‌గౌడ్, జగదీశ్, కష్టం రాజు, విష్ణు, సచిన్, వివేక్, సాయిచరణ్, యాకేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి


జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

కీసర: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ అన్నారు. కీసర చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞాన మాలసమర్పణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో అందరి సహకారంతో 127వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మక్కవరపు శ్రీదేవి, బక్కరి కుమార్, శ్యామ్‌కుమార్, నవీన్, శంకరయ్య, చినింగని బాల్‌రాజ్, సంకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మల్కాజిగిరికి ఎంపీ ఈటల రాక

గౌతంనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సోమవారం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు హాజరు కానున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, రాజ్యలక్ష్మి, మల్కాజిగిరి కన్వీనర్ డీఎస్. వెంకటేశ్‌తోపాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు నిర్వహించే సభకు ఈటల రాజేందర్ హాజరై ప్రజలకు ధన్యవాదాలు తెలపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మల్కాజిగిరి ప్రజలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాలు, బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఒంటరితనం శాపం కాకూడదు



సాక్షి, సిటీబ్యూరో: తోడు తప్పనిసరి అవసరమని, ఏ కారణం చేతనైనా ఒంటరి వాళ్లం అయితే ఏ వయసులోనైనా తోడు వెతుక్కోవడంలో తప్పు లేదని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం తోడు నీడ నిర్వాహకురాలు రాజేశ్వరి అన్నారు. హబ్సిగూడలోని కిన్నెర గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన పరిచయ వేదికలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దలకు తోడును అందించడానికి ఆవిర్భవించిన తమ సంస్థ ఏర్పాటై 15 ఏళ్లు కావస్తోందని ఇప్పటివరకు దాదాపు 500 మంది దాకా జంటగా మారేందుకు తోడ్పాటు అందించామన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో కూడా పెద్ద వయస్సులోని ఒంటరి మహిళలు జంట కట్టే విషయంలో అపోహలు సంకోచాలను వీడకపోవడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా ఆమె పెద్దలకు చట్టప్రకారం ఉన్న హక్కులను వివరించారు. కార్యక్రమానికి సింగిల్స్ పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్స్ హాజరయ్యారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మౌలాలి: ఇంజినీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల మధ్య సమన్వయం లేనందునే సమస్యలు తలెత్తున్నాయన్నారు. డ్రైనేజీ లైన్ వేసిన అనంతరం రోడ్డు పనులు చేపట్టడంతో స్థానికులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి